ప్రజాశక్తి
శుక్రవారం 15 డిసెంబర్ 2023
5
అల్లూరి సీతారామరాజు



ఇవిఎంలపై అవగాహన

ప్రజాశక్తి-పాడేరు: ఎలక్షనికి ఓటింగ్ యంత్రాల వినియోగంపై అధికారులు అవగాహన పెంచుకోవాలని ఐటిడిఏ పిఒ వి.అభిషేక్ సూచించారు. గురువారం ఐటిడిఏ సమావేశ మందిరంలో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వి.వి.ప్యాట్ వినియోగంపై వివరించారు. జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు ఓటు హక్కు నమోదు, ఓట్ల లెక్కింపు లెక్కింపుపై వివరించారు. అరకు వ్యాలీ, పాడేరు, రంపచోడవరం నియోజక వర్గాలలో ఓటు హక్కు నమోదు, ఓటు హక్కు వినియోగం పై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. శిక్షణ, అవగాహన నిమిత్తం జిల్లాలోని మూడు నియోజక వర్గాలకు 6 ఈవిఎం యంత్రాలను కేటాయించామన్నారు. శిక్షణకు కేటాయించిన యంత్ర పరికరాలకు తగిన భద్రత కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్‌ఓ పి.అంబేద్కర్, ఎన్‌డిసి వి.వి.ఎస్. శర్మ, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డి.వి.ఆర్.ఎం. రాజు, గురుకులం ప్రిన్సిపాల్ మూర్తి, పలువురు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మె ఉధృతం

- బలవంతంగా సెంటర్లు తెరిచేందుకు అధికారులు యత్నం
-అడ్డగించిన సిపిఎం నేతలు -మూడో రోజూ కొనసాగిన నిరసనలు



రంపచోడవరంలో మానవహారం చేపడుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి -యంత్రాంగం:

అల్లూరి సీతారామరాజు జిల్లాలో గురువారం అంగన్‌వాడీల సమ్మె ఉధృతంగా సాగింది. అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచేందుకు ప్రయత్నం చేయగా సిపిఎం, ప్రజా సంఘాల నేతలతో కలిసి అంగన్‌వాడీలు అడ్డుకున్నారు.

పాడేరు: తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న విధానం సరి కాదని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ ధ్వజమెత్తారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం మొదటి నుంచి మొండి వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మె జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో మూడవరోజు గురువారం కొనసాగింది. పాడేరులోని అంగన్వాడీల నిరసన దీక్ష శిబిరాన్ని చిన్నయ్య పడాల్ సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్వాడీలకు నిర్బంధాలు కొత్త కాదని జగన్మోహన్ రెడ్డి రాజకీయ జీవితం పది సంవత్సరాలైతే, అంగన్వాడీల ఉద్యోగ జీవితం 50 సంవత్సరాలన్నారు. కొన్నాళ్లుగా చర్చల పేరుతో పేరుతో కాలయాపన చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు బరితెగించి అంగన్వాడీ కేంద్రాలకు తాళాలు వేసి సమ్మె చేస్తుంటే కనీసం అక్కా చెల్లెమ్మలు తోబుట్టువులు గుర్తుకు రాలేదా అని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి అంగన్వాడీ సమస్యల్ని పరిష్కరించి సమ్మె విరమింప చేసేటట్లు ప్రయత్నం చేయాలన్నారు. పాడేరు ఐసిడిఎస్ పరిధిలో భీమసింగి సడెం వీధి లగిసపల్లి జామ గూడ బరిసింగి బంగారుమెట్ట చింతల వీధి అంగన్వాడీ సెంటర్లలో తాళాలు పగలగొట్టించారని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటగుల్లి భాగ్యలక్ష్మి, చిన్నారి, విజయ కుమారి, లక్ష్మి, విజయ, భాగ్య పాల్గొన్నారు. పాడేరులో అంగన్వాడీల దీక్ష శిబిరాన్ని జనసేన అరకు పార్లమెంట్ ఇంచార్జి వంపూరి.గంగులయ్య సందర్శించి ఆందోళనకు మద్దతు ప్రకటించారు.

అరకులోయ రూరల్: వేతనాలు పెంచాలని పాదయాత్రలో జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏమైందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. అరకు వేలి మండలంలో అంగన్వాడి సెంటర్ తెరిచేందుకు వచ్చిన ఎంపీడీఓ, పంచాయితీ అధికారులను నిలదీసి అడ్డుకున్నారు. దీంతో గత్యంతరం లేక అధికారులు వెనుదిరిగారు. అంగన్వాడీలకు కనీస వేతనాలు రూ.26,000 ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, విధుల్లో ఉండి చనిపోయిన కుటుంబాలకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.నాగమ్మ, ప్రాజెక్టు కమిటీ నాయకులు పాంగి వెంకటలక్ష్మి, లక్ష్మి, నిర్మల, జానకి, భవాని, సీత, గౌరమ్మ, వంజన తదితరులు పాల్గొన్నారు.


డుంబ్రిగుడ: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ కార్మికులు చేపడుతున్న సమ్మె గురువారం మూడో రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు సమీపంలోని జాతీయ రహదారికి ఆనుకుని టెంటును ఏర్పాటు చేసి అంగన్వాడీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. రోడ్డుపై వంటావార్పు చేసి తమ నిరసనను తెలియజేశారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వరరావు మాట్లాడుతూ, అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన కోరారు. అంగన్వాడీ కార్యకర్తల సంఘం మండల అధ్యక్షురాలు కొండమ్మ, కార్యదర్శి సత్యావతి, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బాలక్రిష్ణ, కార్మికులు పాల్గొన్నారు.



అనంతగిరిలో అధికారులను ప్రశ్నిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

ముంచింగిపుట్టు: మండలంలోని సుజనకోట, కిలగడ అంగన్వాడి కేంద్రాల లు తెరిచేందుకు వచ్చిన ఎంపిడిఒ, సిడిపిఒ సూపర్‌వైజర్, సచివాలయ సిబ్బందిని సిపిఎం నేతలు అడ్డుకున్నారు. ఎంపీడీవోతో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొర్ర త్రినాథ్ వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ, అంగన్వాడీలతో వెట్టి చాకిరి చేయిస్తున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మొండి వైఖరి ఇప్పటికైనా విడనాడాలన్నారు.గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎమ్మెస్ శ్రీను, సిఐటి మండల కార్యదర్శి కొర్ర శంకర్రావు పాల్గొన్నారు.

అనంతగిరి: అంగన్వాడీలపై ప్రభుత్వం బెదిరింపు చర్యలకు మానుకోవాలని, న్యాయపరమైన డిమ్మాండ్లను పరిష్కరించాలని స్థానిక జెడ్పిటిసి దీసరి గంగరాజు సూచించారు. మూడవ రోజుకు చేరుకున్న సమ్మెలో పాల్గొని మద్దతు ప్రకటించారు. మండల కేంద్రంలో అంగన్వాడి టును ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ సంతోషి కుమారి, సిబ్బంది, వెలుగు ప్రాజెక్ట్, సచివాలయం సిబ్బందిలు సందర్శించి తాళాలు పగలగొట్టి ఓపెన్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా అడ్డుకొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అక్కడనుండి వెను తిరిగారు మండల సిఐటి కార్యదర్శి కె, మొస్య, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎస్, నాగులు వెలుగు విఒఎల సంఘ నాయకురాలు, రంజీత, దిలీప్, అంగన్వాడి యూనియన్ మండల నాయకురాలు మంజుల ,కళావతి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



ముంచంగిపట్టు మండలం కిలగాడలో ఎంపిడిఒను నిలదీస్తున్న సిపిఎం నేత త్రినాథ్

పెదబయలు: అంబేద్కర్ కూడలి జంక్షన్ వద్ద అంగన్వాడీ హెల్పర్స్ మోకాళ్ళపై నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యలకు వ్యతిరేఖంగా నినాదాలు చేసారు. అంగన్వాడీ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు టి.రాజమ్మ, నాయకులు మంగ, పద్మ, సుశీల, కొండమ్మ పాల్గొన్నారు.

హుకుంపేట: మండల కేంద్రంలోనీ ఐసీడీఎస్ కార్యాలయం నుండి ప్రభుత్వ పాఠశాల వరకు అంగన్‌వాడీ కార్యకర్తలు భారీ ర్యాలీ చేపట్టారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవ హారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు టి.కృష్ణారావు, కే.రామారావు, అంగన్వాడీ యూనియన్ మండల నాయకులు అప్పలకొండమ్మ, కృష్ణవేణి, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు రామారావు, పాల్గొన్నారు.

చింతూరు : చింతూరు ఐటిడిఎ ఎదుట అంగన్వాడీల మూడో రోజు ధర్నాను సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనెం సత్యనారాయణ ప్రారంభించారు. వీరి ఆందోళనకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్, కూనవరం వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్. అంగన్వాడీలు జయ, కామేశ్వరి, దుర్గ, నూకరత్నం పాల్గొన్నారు.

మారేడుమిల్లి : స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె దీక్షకు ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, టిడిపి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గొర్లె సునీత, మండల మాజీ అధ్యక్షులు బీశెట్టి అప్పాజీ సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : రాజవొమ్మంగి ఆర్ అండ్ బి అతిథి గృహం ఎదురుగా అంగన్వాడీలు చేపట్టిన ఆందోళన మూడో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ధర్నా శిబిరంలో మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. వీరి ఆందోళనకు ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి రామరాజు, డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు టి శ్రీను మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె వెంకటలక్ష్మి, చిన్ని కుమారి, రమణి, సుందరమ్మ, సత్యవతి, రాజేశ్వరి, మంగ పాల్గొన్నారు.

అడ్డతీగల : స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో అంగన్వాడీలు చేపట్టిన నిరసన కార్యక్రమం మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు మోకాళ్లపై నిలబడి వినూత్నంగా నిరసన తెలిపారు. అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు బేబీ రాణి, సిఐటియు డివిజన్ నాయకురాలు బి నిర్మల, అడ్డతీగల, రాయపల్లి, చెవిటి దిబ్బలు పాల్గొన్నారు.

విఆర్.పురం : అంగన్వాడీలు సమ్మెలో భాగంగా మండలంలోని రేఖపల్లి రెవెన్యూ కార్యాలయం వద్ద మూడో రోజు దీక్ష కొనసాగింది. ఈ సందర్భంగా వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనెం సత్యనారయణ, యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు ముసురు రాజేశ్వరి, సున్నం రంగమ్మ పాల్గొన్నారు.

కూనవరం : అంగన్వాడీల మూడో రోజు సమ్మె సందర్భంగా బస్టాండ్ సెంటర్లో వంటా వార్పు ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. వారి ఆందోళనకు సిపిఎం, యుటిఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సీపీఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు, యుటిఎఫ్ నాయకులు అనిగే నాగేశ్వరరావు, కన్నారావు పాల్గొన్నారు.



అరకులోయలో అధికారులను నిలదీస్తున్న అంగన్‌వాడీలు

కొయ్యూరు : అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఐసిడిఎస్ కార్యాలయ ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపడుతున్న సమ్మె మూడవ రోజుకి చేరింది. ఈ సందర్భంగా శిబిరం వద్ద వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. వీరి ఆందోళనకు వెలుగు సిబ్బంది మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఎస్ సూరిబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.అప్పలనాయుడు పాల్గొన్నారు.

సీలేరు : అంగన్వాడీ వర్కర్లు చేపట్టిన ఆందోళన కార్యక్రమం జీకే వీధి మండల కేంద్రంలో మూడో రోజు చేరుకుంది. ఈ సందర్భంగా వంటా వార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జీకే వీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గడుతూరు సత్యనారాయణ పాల్గొన్నారు.

రంపచోడవరం : రంపచోడవరం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె మూడవ రోజుకి చేరింది. సమ్మెలో భాగంగా తహసిల్దార్ కార్యాలయం నుండి అంబేద్కర్ కూడలి వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ మానవహారం నిర్వహించారు. వీరి ఆందోళనకు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్, యుటిఎఫ్ నాయకులు వెంగళరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి ప్రాజెక్టు నాయకులు కారం రామలక్ష్మి, మంగమ్మ, చిట్టెమ్మలు, సింగారమ్మ, సత్యవేణి పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం తాళం పగలగొట్టిన అధికారులు
అడ్డుకున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ వర్కర్లు సమ్మె చేస్తున్న నేపథ్యంలో రాజవొమ్మంగి అంగన్వాడీ కేంద్రం-2 తాళాలను స్థానిక సిడిపిఓ దేవమణి, సూపర్వైజర్లు, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీస్ తదితరులు బద్దలగొట్టి లోపలకు ప్రవేశించారు. విషయం తెలుసుకున్న అంగన్వాడీలు, గిరిజన సంఘం, సిఐటియు, డివైఎఫ్ఐ నాయకులు అక్కడికి చేరుకొని అధికారులను అడ్డుకున్నారు. తమ సమస్యలపై ఆందోళన చేస్తుంటే పరిష్కరించకపోగా, ఈ విధంగా వ్యవహరించడం తగదని నాయకులు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం కేంద్రాలను తెరిచి లబ్ధిదారులకు పౌష్టికాహారం ఇవ్వాలని స్థానిక ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు అంగన్వాడీలకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాలను తీయడానికి వీలులేదని అడ్డుకోవడంతో చేసేదేమీ లేక అధికారులు వెనుదిరుగారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, సిఐటియు, డివైఎఫ్ఐ నాయకులు పి రామరాజు, టి శ్రీను, అంగన్వాడీ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, చిన్ని కుమారి, రమణి, రాజేశ్వరి, సత్యవతి పాల్గొన్నారు.



రాజ ఒమ్మంగిలో అధికారులను నిలదీస్తున్న అంగన్‌వాడీలు

ఫుడ్ కమిటీ చైర్మన్ కాన్వాయ్ అడ్డగింత

ప్రజాశక్తి-చింతపల్లి: అంగన్వాడీల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని రాష్ట్ర ఫుడ్ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి అన్నారు. చింతపల్లిలో పర్యటించిన ఆయన్ను మండల కేంద్రంలోని తసిల్దార్ కార్యాలయం ఎదురుగా సమ్మెలో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు ఆయన కాన్వాయ్ ను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకుడు ధనుంజయ్‌కు చైర్మన్ సెక్యూరిటీ గార్డుల మధ్య కాసేపు ఘర్షణ సాగింది. ఫుడ్ కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి అంగన్వాడీల సమస్యలతో తనకు సంబంధం లేదని చెప్పడంతో ఆయనను నిలదీశారు. దీంతో, ఫుడ్ కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి అంగన్వాడీల సమస్యలపై స్పందిస్తూ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఒకటి రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి మంచి వార్త వింటారని సమాధానం చెప్పారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి, మండలకమిటి సభ్యుడు కిల్లో సింహాచలం, అంగన్వాడీల సమ్మెకు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి అధ్యక్ష, కార్యదర్శులు పెంటమ్మ, కే.రాములమ్మ, అంగన్వాడి కార్యకర్తలు అక్కమ్మ, శ్రీలక్ష్మి, రాజేశ్వరి, ప్రశాంతి, రమణమ్మ, కుమారి పాల్గొన్నారు.



ఫుడ్ కమిటీ చైర్మన్ కాన్వాయ్‌ను అడ్డగించిన సిఐటియు నేతలు, అంగన్‌వాడీలు



మాట్లాడుతున్న అధ్యాపకులు

ఇంధన పొదుపుపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-చింతూరు

బొగ్గు, కలప, పెట్రోలు, డీజిల్, గ్యాస్ వంటి ఇంధన వనరుల పొదుపుపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఇంధన సంరక్షణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్ మాట్లాడుతూ ఇంధనలు తగిన మోతాదులో వాడి సుస్థిర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగం కావాలని కోరారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర అధ్యాపకులు జి. వెంకట్రావు, ఆంగ్ల అధ్యాపకులు ఆర్‌సిహెచ్ నాగేశ్వరరావు, అధ్యాపకులు వై పద్మ, జి.హారతి, ఎం.నాగమోహనరావు, కె.శైలజ, సి.హెచ్. రాజాబాబు, కె.శ్రీలక్ష్మి, పి. ఏడుకొండలు, పి.అలివేలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు బాలికల ఆశ్రమం పాఠశాలలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య అధికారులు మస్తాన్ వల్లి, సౌమ్య, చింతపల్లి ఎడాల్ సెంట్ కౌన్సిలర్ పి.దుర్గారావు సంయుక్తంగా పీర్ ఎడ్జికేటర్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా గుడ్ టచ్, బెడ్ టచ్, నెలసరి ఇబ్బందులు, రక్తహీనత, హస్తశుద్ధి మొదలగు విషయాలపై విద్యార్థులకు తెలియజేశారు. రక్తహీనతతో బాధపడేవారు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు రోజుకు మధ్యాహ్నం భోజనం తరువాత రెండు మాత్రలు మింగాలని సూచించారు. అంటువ్యాధులు, చర్మ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి కే. జోజి బాబు, హెల్త్ అసిస్టెంట్ ఎన్. త్రినాధ, హెల్త్ విజిటర్ బాలమణి, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఆశా కార్యకర్తలు కరుణ మణి, వసంతి పాల్గొన్నారు.



విద్యార్థికి వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

ఆశా వర్కర్ల 36 గంటల మహాధర్నా ప్రారంభం

ప్రజాశక్తి-రంపచోడవరం

సమస్యలను పరిష్కరించాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ఆశా వర్కర్లు స్థానిక ఐటిడిఎ కార్యాలయం ఎదుట 36 గంటల మహాధర్నాను గురువారం ప్రారంభించారు. సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్ ధర్నా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, ఆశా వర్కర్ చనిపోతే వాళ్ళ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. న్యాయమైన ఈ డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కరింకోట రమణమ్మ, పోసి రాధమ్మ, కొమరం చెల్లాయమ్మ, కుంజం వీరలక్ష్మి, కత్తుల శాంతమ్మ, కుంజం మంగమ్మ, పెద్ద సంఖ్యలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతూరు : చింతూరు ఐటీడీఏ కార్యాలయం ముందు విలీన నాలుగు మండలాల ఆశా వర్కర్లు 36 గంటల ధర్నాను చేపట్టారు. ఈ ధర్నాను విఆర్ పురం ఎంపీపీ కారం లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ నాలుగున్నరేళ్ల పాలనలో ఆశా వర్కర్లకు కనీస వేతనం పెంచలేదన్నారు. జగన్ ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే తెలంగాణ కెసిఆర్‌కు పట్టిన గతే జగన్ కూడా పడుతుందని హెచ్చరించారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనం సత్యనారాయణ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు రిటర్మెంట్ బెనిఫిట్స్, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, రాజకీయ వేధింపుల ఆపాలని, ప్రభుత్వ సెలవలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్, కూనవరం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, ఎంపీటీసీ వేక రాజ్ కుమార్, పిఎన్ఎం రాష్ట్ర నాయకులు సుబ్బారావు, రాజయ్య సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకలు పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, బీరబోయిన దిలీప్, నాలుగు మండలాల ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రవ్వ వీరమ్మ, మడకం శ్రీదేవి, నూతన ముత్తమ్మ, సుజాత, దుర్గ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పాడేరు ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాల్

పాడేరు : జీతాలు పెంచుతారా లేక ప్రభుత్వం నుండి దిగుతాతారో తేల్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ ప్రశ్నించారు. పాడేరు ఐటిడిఏ ఎదురుగా గురువారం ఆశాలు, సిహెచ్ డబ్ల్యూలు 36 గంటల మహా ధర్నాను చేపట్టారు. ఈ మహా ధర్నా ను ఉద్దేశించి చిన్నయపడాల్ మాట్లాడుతూ, చిరు ఉద్యోగులు, స్కీం వర్కర్లకు, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులకు మంచి రోజులు వస్తాయని ఆశపడి సిఎం జగన్‌ను గెలిపించారని, ఐదవ సంవత్సరం ఎన్నికలు సమీపిస్తున్నప్పటికీ ప్రభుత్వం కనీసం స్పందించక పోవడం దుర్మార్గమన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పోరాటం తప్ప మరో మార్గం లేదన్నారు. ప్రభుత్వాలు స్పందించకుంటే మూడు నెలలు రాబోయే ఎన్నికల్లో స్పందించవలసి వస్తుందని గుర్తు చేశారు. జనసేన అరకు పార్లమెంట్ ఇన్చార్జి వంపురి గంగులయ్య, సిపిఐ అల్లూరు జిల్లా కార్యదర్శి పుటిక సత్యనారాయణ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎల్.సుందర్రావు, ఆశ సిహెచ్ డబ్ల్యుల సంఘం జిల్లా రాష్ట్ర నాయకులు వై మంగమ్మ, పార్వతి, దాసమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట : ఆశ వర్కర్ల సమ్యలను పరిష్కరించాలని సీఐటీయూ నేత మంగమ్మ, దాసమ్మ డిమాండ్ చేశారు. ఐటీడీఏ పీఓ, డీఎంఅండ్ హెచ్‌ఓలకు సమ్మె నోటీసు గురువారం సీఐటీయూ నేతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, జిల్లా నేతలు పార్వతి, తదితరులు పాల్గొన్నారు.



రంపచోడవరంలో ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు



చింతూరులో ధర్నాను ప్రారంభిస్తున్న ఎంపిపి లక్ష్మి



విద్యార్థులతో మాట్లాడుతున్న విజయప్రతాప్‌రెడ్డి

అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించం

- మెనూ సక్రమంగా అమలు చేయకుంటే చర్యలు
- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి -సీలేరు

జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు, గిరిజేన సంక్షేమ సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో భోజనాలు ఏర్పాటులో అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాపరెడ్డి హెచ్చరించారు. ఆయన గురువారం జీకే వీధి మండలంలోని పలు పాఠశాలు, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి తనిఖీలు చేశారు. ముందుగా సీలేరు సమీపంలో ఉన్న ఏపీ గురుకుల పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులకు వంటలు చేస్తున్న కిచెన్‌ను పరిశీలించారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని, భోజనాలు నాణ్యంగా రుచికరంగా పెట్టాలని ప్రిన్సిపాల్ బుచ్చిబాబును ఆదేశించారు. తరగతి గదులకు వెళ్లి విద్యా బోధన తీరుపై విద్యార్థులతో మాట్లాడారు. గుడ్లు, చికెను, భోజనం సక్రమంగా పెడుతున్నారా లేదా అని అడిగి ఆరా తీశారు. సీలేరు బాలికల ఆశ్రమం పాఠశాలకు చేరుకుని వండిన ఆహార పదార్థాలు పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. ఇంకా దారకొండ, సప్పర్ల ఆశ్రమం పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయులు విద్య బోధన సక్రమంగా చేస్తున్నారా లేదని అడిగి తెలుసుకున్నారు. మెనూ సక్రమంగా అమలు చేయకుంటే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పేద ప్రజలు, విద్యార్థులకు అందేటట్లు చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జికే వీధి డిప్యూటీ తహశీల్దారు కుమారస్వామి, ఆర్ఐ మహాదేవ్, వార్డెన్ నాగ శకుంతల, ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, సర్పంచ్ దుర్జో, ఉప సర్పంచ్ కే.వల్లి ప్రసాద్, జీకే వీధి సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి-రంపచోడవరం

మండలంలో పెద్దగడ్డ గ్రామంలో నేరం చెన్నాలమ్మకు చెందిన తాటాకిల్లు గురువారం సాయంత్రం దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటా హుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపు చేశారు. ఈ అగ్ని ప్రమాదంలో చెన్నాలమ్మకు చెందిన బట్టలు సామాగ్రి ఇతర వస్తువులు పూర్తిగా కాలి బూడిద కావడంతో ఆమె సర్వస్వం కోల్పోయినదని ఆస్తి నష్టం సుమారు రెండు లక్షల వరకు ఉండొచ్చని తెలిపారు. ఆమెను ఆదుకోవాలని కోరారు.

విద్యార్థికి అభినందన



అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు వంతెనిని బాలాజీ,తదితరులు

ప్రజాశక్తి హుకుంపేట:-మండలంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల బాలుర-1 విద్యార్థి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొని ప్రథమ బహుమతి పొందిన ఎస్.నాగరాజు ను గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వంతెనిని బాలాజీ, ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి అభినందించారు. హుకుంపేట ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల బాలుర-1లో విద్యార్థి ఎస్ నాగరాజు పదవ తరగతి విద్యను అభ్యసిస్తూ విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రథమ బహుమతి పొందారు. అందుకు గాను గురువారం పాఠశాలలో నాగరాజును అభినందించారు.అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలన్నారు.అన్ని వైపుల్యూ కలిగి ఉండాలని ఆయన సూచించారు.ప్రథమ బహుమతి పొందినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ సంచాలకులు విద్యార్థిని అభినందించారు.

గీతంతో అనుబంధానికి వర్జీనియా వర్సిటీ ఆసక్తి



చర్చలు జరుపుతున్న రెండు వర్శిటీల ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ : అమెరికాలో ప్రభుత్వ రంగ విశ్వవిద్యాలయాలలో ఒకటైన ప్రముఖ వర్జీనియా కామన్వెల్త్ యూనివర్సిటీ బృందం గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. వర్జీనియా విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ మోహన్ గుప్తా సారథ్యంలోని బృందం గీతం ప్రైవెట్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు, తదితరులతో సమావేశమై, బోధన, పరిశోధన అంశాలలో పరస్పర సహకారంపై చర్చలు జరిపింది. ఈ సందర్భంగా గీతం ప్రైవెట్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు మాట్లాడుతూ భారత ప్రభుత్వ నూతన విద్యావిధానంలో భాగంగా గీతంలో అమలు చేస్తున్న సంస్కరణలను వివరించారు. ప్రపంచ శ్రేణి విశ్వవిద్యాలయంగా గీతంను తీర్చిదిద్దడానికి దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించామని, విదేశీ విశ్వవిద్యాలయాలతో సంయుక్త అధ్యయనాలకు తాము ఆసక్తితో ఉన్నామని స్పష్టం చేశారు. వర్జీనియా కామన్వెల్త్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ మోహన గుప్తా మాట్లాడుతూ 140 దేశాలకు చెందిన వెయ్యి మందికి పైగా విద్యార్థులు తమ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్, మేనేజ్మెంట్ వంటి కోర్సులు అధ్యయనం చేస్తున్నారన్నారు. అమెరికాలోని నూతనత్వం గల విశ్వవిద్యాలయంగా తమకు గుర్తింపు లభించిందని వెల్లడించారు, తమ విద్యార్థులకు ప్రముఖ సంస్థలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. గీతంతో బోధన, పరిశోధనలపై కలిసి నడవడానికి తాము ఆసక్తితో ఉన్నామని ప్రకటించారు. ఈ సందర్భంగా గీతం విశ్వవిద్యాలయంలోని పలు విభాగాలను వర్జీనియా కామన్వెల్త్ యూనివర్సిటీ బృందం సందర్శించింది. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్. కృష్ణ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సిహెచ్.విజయశేఖర్, స్కూల్ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగన్నాథ్ దాస్, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డైరెక్టర్ డాక్టర్ కె.పి. కిషన్, అకడమిక్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ రాధిక పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు 36 వినతులు



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పాడేరు: స్థానిక సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో గురువారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందనకు 36 వినతులు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, ఐటిడిఏ పిఒ వి.అభిషేక్, డిఆర్ఓ పి.అంబేద్కర్‌లు వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. రహదారుల నిర్మాణాలు, భూముల రీ సర్వే, సామాజికి పింఛన్లు, పెళ్లి కానుక మంజూరు, భూ సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. అనంతగిరి మండలం కివర్ల పంచాయతీ జాలాడ గ్రామానికి చెందిన ఆర్.లక్ష్మణరావు ఈ ఏడాది మే నెలలో వివాహం చేసుకున్నానని, పెళ్లి కానుక ప్రోత్సాహకం అందించాలని వినతి పత్రం సమర్పించారు. ముంచంగిపుట్టు మండలం మాకవరం గ్రామస్తులు పి.జగతి, పాంగి బొల్లి తమ భూములు రీ సర్వే చేయాలని అర్జీ పత్రం అందజేసారు. పెదబయలు మండలం పెదకోడా పల్లి గ్రామ పంచాయతీ చెక్కురాయి గ్రామస్తుడు రేగం చంటిబాబు తన కుమారుడు విష్ణు మానసిక ఎదుగుదల లోపంతో బాధపడుతున్నాడని పింఛను మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. జి.మాడుగుల మండలం కె.కోడాపల్లి పంచాయతీ జె.గొందివీధి గ్రామస్తులు కె.సింహాచలం, కె. సత్యారావు రోడ్డు మంజూరు చేయాలని కోరారు. ముంచంగిపుట్టు మండలం బంగారు మెట్ట సర్పంచ్ వంతాల రత్నం మాలగుమ్మి సెంటర్ నుండి బాదిపట్టు గ్రామం వరకు మూడు కిలో మీటర్ల రోడ్డు నిర్మించాలని వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌సి వి.వి.ఎస్.శర్మ, గిరిజన సంక్షేమ శాఖ ఇఇలు డివిఆర్ఎం రాజు, కె. వేణుగోపాల్, రహదారులు భవనాల శాఖ ఇఇ బాల సుందరబాబు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇఇ లీలా కృష్ణ, ఎల్డీఎ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



కార్యకర్తలతో మాట్లాడుతున్న పెదలబుడు డి సర్పంచ్ దాస్ బాబు.

ప్రజాశక్తి-అరకు లోయ :అరకు నియోజకవర్గంలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాసుబాబు కోరారు. అరకులోయలోని పంచాయితీ కార్యాలయంలో గురువారం క్లస్టర్, బూత్ లెవెల్ కేడర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సియరి దొన్నుదొరకు తెలుగుదేశం పార్టీ అరుకు నియోజకవర్గం ఇన్చార్జిగా నియమించిందని ఆయనకే టికెట్ కూడా దక్కుతుందని ఆయన ఆశా భావం వ్యక్తం చేశారు.పార్టీ కార్యకర్తలు నాయకులు సైనికుల్లా పనిచేస్తే తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమని ఆయన అన్నారు. గ్రామీణ స్థాయిలో ప్రతి ఒక్కరికి తెలుగుదేశంతో కలిగే ఉపయోగం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేసినటువంటి దుర్మార్గాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సంపదను దోచుకోవడానికి జగన్ అతను అనుయాయులకు గనులు లీజులు ఇవ్వడం, జీవో నెంబర్ 3, పంచాయతీకి నిధులు ఇవ్వకపోవడం, సిపిఎస్ రద్దు చేయకపోవడం బోయ, బెంతు వరియాలను ఎస్టీ జాబితాలో కలుపుతూ అసెంబ్లీలో తీర్మానం చేసినటువంటి అంశాలు అన్నిటిని ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం కల్పించాల్సిన అవసరం శ్రేణులపై ఉందన్నారు.

వాడీవేడిగా అప్పన్న ట్రస్ట్ బోర్డు సమావేశం

పలు అంశాలు ఆమోదం.. 2024 సంవత్సరపు కేలండర్ ఆవిష్కరణ



మాట్లాడుతున్న అశోక్ గజపతి రాజు

ప్రజాశక్తి-సింహాచలం: శ్రీకృష్ణాపురం సమీపంలోని నృసింహవనంలో దేవస్థానం అనువంశిక ధర్మకర్త చైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజు అధ్యక్షతన జరిగిన సింహాచల దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశం గురువారం వాడీవేడిగా సాగింది. 27 అంశాలతో కూడిన అజెండాను సభ్యుల ముందు ఇఒ షింగాల శ్రీనివాస్‌మూర్తి ఉంచగా,.అజెండాలో లేని అంశాలను సభ్యులు ప్రస్తావించడంతో చైర్మన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కొద్దిసేపు దీనిపై వాగ్వాదం జరగగా, అజెండాలోని అంశాల తర్వాతే మిగిలిన అంశాలను చర్చిద్దామని చైర్మన్ స్పష్టం చేయడంతో దానిపై చర్చ జరిగింది. కొద్దిసేపు తర్వాత చర్చ మళ్లీ పక్కదోవ పట్టడంతో చైర్మన్ రూల్స్ పాటించాలంటూ అసహనం వ్యక్తం చేశారు. సాంస్కృతిక పాఠశాల ఉపాధ్యాయుల భర్తీ వెంటనే చేపట్టాలని సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఎయిడెడ్ స్కూల్స్ అంశంపై తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తావించారు. సెల్‌ఫోన్లు, బ్యాగులు భద్రపరిచే కేంద్రం వద్ద నిబంధన విరుద్ధంగా అధిక ధరలు వసూలు చేస్తున్న కాంట్రాక్టర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సభ్యులు ప్రశ్నించారు. శ్రీదేవి కాంప్లెక్స్‌లో దుకాణాల వేలంపై కొందరు సభ్యులు అభ్యంతర వ్యక్తం చేస్తూ, మళ్లీ వేలం నిర్వహించాలని డిమాండ్ చేశారు ఇంజనీరింగ్ విభాగం పనులపై అంశాలు చర్చకు వచ్చాయి టోల్‌గేట్ బహిరంగవేలంపై కొందరుఅభ్యంతరం వ్యక్తం చేయగా, మెజార్టీ సభ్యులు నిర్ణయం మేరకు చర్యలుంటాయన్నారు. గడిచిన మూడు నెలల్లో అధికారులు రూ.1.80కోట్ల బకాయి వసూలు చేసినట్లు సభ దృష్టికి తెచ్చారు. 2024 కేలండర్‌ను ఆవిష్కరించారు.

పకడ్బందీగా పంట నష్టాల నమోదు

-వ్యవసాయాధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు:ఇటీవల సంభవించిన మిచౌంగ్ తుఫాన్‌తో పంటలు నష్టపోయిన ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా నష్టాన్ని సక్రమంగా గణన చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వ్యవసాయాధికారులను ఆదేశించారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులు, వ్యవసాయాదికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచనావేయాలని, వీటిపై మండల వ్యవసాయ, ఉద్యాన అధికారులు నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. పంట కోత ప్రయోగాలు 40 శాతం మాత్రమే జరిగినందున మిగిలిన 60 శాతం కూడా త్వరగా పూర్తి చేసి నివేదించాలని ఆదేశించారు. దీంతో, రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్, ఇన్ పుట్ సబ్సిడీ వస్తుందన్నారు. నిర్దేశించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, మిల్లర్లు, లారీ యజమానులతో చర్చించి ఎప్పటికప్పుడు ధాన్యం మిల్లర్లకు పంపించే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాగి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారు. రంగు మారిన ధాన్యం గుర్తించాలని, వాటిని రైతు నష్ట పోనీ విధంగా మిల్లర్లతో ప్రత్యేకంగా చర్చించి కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులను ఆదేశించారు. పోలవరం భూములలో కూడా పంట నష్టాన్ని గణన చేసి నివేదించాలని కలెక్టర్ ఆదేశించారు. మండల స్థాయి అధికారులు గ్రామాలలో పర్యటించి రైతులలో ధైర్యాన్ని, నమ్మకాన్ని కలిగించాలని సూచించారు. ఈ నెల 18 వరకు ఎన్యూమరేషన్, 21 వరకు సోషల్ ఆడిట్, 26న పంట నష్టం తుది జాబితా అందించాలని ఆదేశించారు.

టిడిపి పథకాలపై ప్రచారం



ప్రచారం చేపడుతున్న నేతలు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా కేంద్రంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గురువారం బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి ఆదేశాల మేరకు పాడేరు పట్టణంలో టీడీపీ పాడేరు నియోజకవర్గం ఇంచార్జ్ బుద్ధ జ్యోతి కిరణ్ మాట్లాడుతూ రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమే చంద్రన్నతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. బూత్ కమిటీ అధ్యక్షులు కోటి బాబు, తెలుగుదేశం పార్టీ ట్రేడర్స్ యూనియన్ మండల సభ్యులు సున్నం లక్ష్మణ్ రావు, పాడేరు వర్తక సంఘం సభ్యులు శ్రీశైలపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన



అవగాహనా కల్పిస్తున్న రామ్మోహన్ రావు

ప్రజాశక్తి - పెదబయలు : స్థానిక గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో గురువారం ఏవిఎన్ కళాశాల విశ్రాంత కెమిస్ట్రీ అధ్యాపకులు రామ్మోహన్ రావు కేన్సర్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కేన్సర్ రావడానికి కారణాలు, నివారణ మార్గాలను సూచించారు. పొగాకు, ఖైని, సిగరెట్ ఇతర మత్తు పదార్థాలకు ఉండాలని సూచించారు. సిఎచ్‌స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ డి ఎస్ శంకర్‌రావు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-ఎటపాక : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ (సిఐటియు) ఆద్వర్యాన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు గురువారం ఉపాధి హామీ కార్యాలయంలో ఇసికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలపై రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా డిసెంబర్ 18న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా, 2024 జనవరి 8న చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్నందున ఆ రెండు రోజులు విధులకు హాజరు కాలేమని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని, దినాలు టార్గెట్ విధానం రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, మూడేళ్లు పూర్తి చేసుకున్న ప్రతిఎఫ్ఎని టెక్నికల్ అసిస్టెంట్‌గా గుర్తించాలని, రిటైర్మెంట్ తర్వాత ప్రతి కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పెనుబల్లి రాంబాబు, గోవిందు, సంపత్, మోహన్‌రావు, పూనమ్ సీతయ్య తదితరులు పాల్గొన్నారు

విద్యుత్ పొదుపు వారోత్సవాల ర్యాలీ

ప్రజాశక్తి రంపచోడవరం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాలలో భాగంగా రంపచోడవరం విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యమ్.డి యూసఫ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు గురువారం ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ పొదుపుపై ప్రతిజ్ఞ చేసి అనంతరం రంపచోడవరం డివిజన్ ఆఫీస్ నుండి సిబ్బంది అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ చేసి, అక్కడ మానవహారం నిర్వహించారు. విద్యుత్ పొదుపు, వినియోగంపై నినాదాలు చేసి ప్రజలలో అవగాహన కల్పించారు.

శిరమయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి- కూనవరం

మండలంలోని పల్లూరు గ్రామానికి చెందిన సిపిఎం శాఖ సభ్యులు నూపా శిరమయ్య అనారోగ్యం కారణంగా మృతి చెందారు. ఈ సందర్భంగా పార్టీ కూనవరం మండల కమిటీ నాయకులు నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ శిరమయ్య 20ఏళ్లుగా పార్టీలోనే ఉంటూ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు, జొడే రాజు తదితరులు పాల్గొన్నారు.



నివాళ్లర్పిస్తున్న నేతలు

రుషికొండలో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నగరంలోని రుషికొండ ప్రాంతంలో కేంద్ర పర్యావరణ సాంకేతిక నిపుణుల బృందం గురువారం ఉదయం 11 గంటల సమయంలో పర్యటించింది. మూడు కార్లలో కమిటీ కొండపైకి వెళ్లి రెండు గంటల పాటు పరిశీలన జరిపింది. అక్కడ నిర్మాణంలో ఉన్న భవంతులన్నింటిలో కమిటీ సభ్యులు కలియదిరిగారు. వృక్షాల గురించి ఆరా తీసినట్లు తెలుస్తోంది. మీడియా సిబ్బందికి తారసపడకుండా రహస్యంగా ఈ పర్యటన సాగడం గమనార్హం. కార్లలో కొండపైకి వెళ్లిన కేంద్ర బృందం పలు విషయాలను అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని, సూపర్‌వైజర్లను అడిగి తెలుసుకున్నట్లు భోగట్టా. ఎంత వరకూ నిర్మాణాలు వచ్చాయి ? ఇంకా ఎంత పని మిగిలి ఉంది ? కొండపై భాగంలో పర్యావరణ పరిస్థితులు ఎలా ఉన్నాయి ? అన్న విషయాలను మదించినట్లు తెలుస్తోంది.

మూడో రోజుకు తపాలా ఉద్యోగుల సమ్మె



రంపచోడవరంలో నినాదాలు చేస్తున్న తపాలా ఉద్యోగులు

ప్రజాశక్తి రంపచోడవరం

అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన సమ్మె మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగ రంపచోడవరం తపాలా కార్యాలయం ముందు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్‌పిఇ జిడిఎస్ యూనియన్ రాజమండ్రి డివిజన్ కార్యదర్శి ఆర్.పుష్కరం మాట్లాడుతూ జీడీఎస్ ఉద్యోగులతో సమానంగా పనిగంటలు, జీత భత్యాలు, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, కమలేష్ చంద్ర కమిటీ నివేదికలోని అన్ని అనుకూల సిఫార్సులను తక్షణమే అమలు చేయాలని, యూనియన్ సభ్యత్వ ధ్రువీకరణ చేయాలని, జీడీఎస్‌పై అసాధ్యమైన, అశాస్త్రీయమైన లక్ష్యాలను విధించడం ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై పలు మార్లు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమ్మెకు అందరూ మద్దతు తెలపాలని కోరారు. సమస్యలు పరిష్కరించే వరకు ఈ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వీరి ఆందోళనకు రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబు రమేష్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సింహాచలం, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, సువార్త కుమార్, భవాని తదితరులు పాల్గొన్నారు.

చింతూరు : తమ కోర్కెల సాధనకై పోస్టల్ ఉద్యోగులు చింతూరులోని సబ్ పోస్టాఫీసు కార్యాలయం ఎదుట తలపెట్టిన నిరవధిక సమ్మె మూడో రోజుకు చేరింది. ఉన్నతాధికారులు, కేంద్ర ప్రభుత్వం తమ కోర్కెలను ఆమోదించే వరకు సమ్మె సాగిస్తామని ఉద్యోగులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లి శ్రీనివాసరావు, శ్రీనుబాబు, ఆదినారాయణ, పులి వెంకటనారాయణ, సత్యనారాయణ రెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశాఖ బాలోత్సవం ప్రారంభం



ప్రారంభ సభలో మాట్లాడుతున్న రమాదేవి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగరంలో మూడు రోజులు పాటు తలపెట్టిన 'విశాఖ బాలోత్సవం' గురువారం అత్యంత ఉత్సాహంగా ప్రారంభమైంది. గ్రీన్ పార్క్ హోటల్ రోడ్డులో సెయింట్ ఆంథోనీ తెలుగు మీడియం ఎలిమెంటరీ స్కూల్ ఆవరణలో జరుగుతున్న ఈ పిల్లల పండుగ ప్రారంభ సభకు విశాఖ బాలోత్సవం ఉపాధ్యక్షురాలు కె.రమాప్రభ అధ్యక్షత వహించారు. ఈ మెగా చిల్డ్రన్ ఫెస్టివల్‌ను విశాఖ బాలోత్సవం గౌరవాధ్యక్షులు లయన్స్ క్లబ్‌కు చెందిన డాక్టర్ ఎన్‌విఎన్.దుర్గాప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడు పిల్లలు అటు పుస్తకాలకో లేక మొబైల్ ఫోన్లకో అంకితమైపోతుండటం వల్ల వారి సృజనాత్మకత, క్రీడల పట్ల వారి ఆసక్తి వంటివన్నీ మరుగున పడిపోతున్నాయని తెలిపారు. అందువల్ల వారి సంపూర్ణ ఎదుగుదల కుంటుపడుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ నిర్వహిస్తున్న విశాఖ బాలోత్సవం పిల్లల్లోని సృజనాత్మక ఆలోచనలకు, కళాత్మక విలువలకు, క్రీడా స్ఫూర్తికి వేదిక కాబోతోందన్నారు. ఇటువంటి బాలోత్సవం ప్రతి ఏటా నిర్వహించాలని కాంక్షిస్తూ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అమరావతి బాలోత్సవ నాయకులు డి.రమాదేవి మాట్లాడుతూ పిల్లలకు ఇటువంటి ఉత్సవాలు కొత్త శక్తిని ఇస్తాయన్నారు. నిర్వాహకులను అభినందించారు. సభలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ డిఎం.రావు, ఆర్‌సిఎం స్కూల్స్ డిజిఎం పి.రత్నకుమార్, ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధి బిమ్మి బాల, ఆసరా ఛారిటబుల్ సొసైటీ ప్రతినిధి సుధా, కన్సర్న్ సంస్థకు చెందిన జోష్, బాల వికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, విశాఖ బాలోత్సవం గౌరవ సలహాదారు డాక్టర్ వైఎల్ఎన్.రావు మాట్లాడారు. మూడు రోజులు జరిగే ఈ మెగా చిల్డ్రన్ ఫెస్టివల్ విధివిధానాలను, వాటికి సంబంధించిన వివరాలను కె.రమాప్రభ వివరించారు. అడిగిన వెంటనే సెయింట్ ఆంథోనీ స్కూల్ ఆవరణను పెద్ద మనసుతో ఇచ్చినందుకు రెవరెండ్ ఫాదర్ పి.రత్నకుమార్‌కు, ఫెస్టివల్ విజయవంతం కావడానికి సహాయ సహకారాలందించిన వారందరికీ విశాఖ బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జిఎస్.రాజేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. సుమారు వెయ్యి మందికిపైగా పిల్లలు పాల్గొన్న ఈ ప్రారంభ సభకు విచ్చేసిన వారందరికీ విశాఖ బాలోత్సవం ఉపాధ్యక్షులు ఎం.ఎల్లాజీ ఆహ్వానం పలికారు. విశాఖ బాలోత్సవం అధ్యక్షులు పి.రఘు, ఉపాధ్యక్షులు దండు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తొలిరోజు పోటీలు ఇలా..

ఎంవిపి.కాలనీ : కల్చరల్ ఈవెంట్స్‌లో సీనియర్స్ విభాగంలో జానపద గీతాలాపన (సోలో), దేశభక్తి గీతాలాపన (బృందం), దేశభక్తి గీతాలాపన (సోలో), మిమిక్రీ, రైమ్స్ (ఇంగ్లీష్), పౌరాణిక పద్యగానం అంశాలలో పోటీలు నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో జానపద గీతాలాపన (సోలో), లఘు నాటికలు, జానపద గీతాలాపన (బృందం), విచిత్ర వేషధారణలు జూనియర్స్, రైమ్స్ (తెలుగు) అంశాలలో పోటీలలో నిర్వహించారు. అకడమిక్ ఈవెంట్స్‌లో సీనియర్స్ విభాగంలో చిత్రలేఖనం (స్పాట్ డ్రాయింగ్), కార్టూన్ గీయడం, వ్యాస రచన (తెలుగు), వ్యాస రచన (ఇంగ్లీష్), స్పెల్ బి (ఇంగ్లీష్), సైన్స్ ఎగ్జిబిషన్, దినపత్రికా పఠనం, మ్యాపింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.



జలప్రవేశం చేసిన తర్ముగ్లీ

ఐఎన్ఎస్ తర్ముగ్లీ జలప్రవేశం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : ఐఎన్ఎస్ తర్ముగ్లీ ఫాస్ట్ ఎటాక్ క్రాఫ్ట్ (ఎఫ్ఎసి) యుద్ధనౌక గురువారం విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డులో ఉన్నతాధికారుల సమక్షంలో జలప్రవేశం చేసింది. ఫాస్ట్ ఎటాక్ క్రాఫ్ట్‌గా రూపొందిన ఈ నౌకకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. తొలుత 2006లో మాల్దీవియన్ నేవల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఎంఎన్‌డిఎఫ్)కు దీన్ని కేంద్ర ప్రభుత్వం బహుమతిగా ఇచ్చింది. ప్రస్తుతం ఈ నౌక ఈ ఏడాది మేలో పోస్ట్ ఎక్స్‌టెన్సివ్ రిస్టోరేషన్ పనులకు నేవల్ డాక్‌యార్డుకు విచ్చేసింది. ఆరు నెలల పాటు అన్ని పరీక్షలనూ పూర్తిచేసుకుని రీ-ఇండక్షన్ (పున:ప్రవేశం) గురువారం చేసింది. ఈ యుద్ధ నౌక పూర్తిగా మరింత అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో నేవల్ డాక్‌యార్డులో ఫిట్టింగ్ చేయబడింది. ఎంటియు ఇంజిన్లు, వాటర్ జెట్ యంత్ర సామగ్రి, అబ్బురపరిచే తాజా కమ్యూనికేషన్ వ్యవస్థ, 30 ఎంఎం గన్, అడ్వాన్స్‌డ్ రాడార్ సిస్టంతో సిద్ధం చేయబడింది. తీర గస్తీ (కోస్టల్ సర్వేలెన్స్) కోసం, దేశంలోని తూర్పు కోస్తా తీరం, కేజీ బేసిన్ రక్షణ కోసం ప్రత్యేకించి ఉద్దేశించిన నౌకగా దీన్ని మరింతగా సిద్ధం చేశారు. ఐఎన్ఎస్ తర్ముగ్లీకి కమడోర్ సత్పాల్‌సింగ్ కమాండింగ్ అధికారిగానూ, ఆంధ్రప్రదేశ్‌లో ఇన్చార్జిగానూ వ్యవహరించనున్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి, సంక్షేమం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఏజెన్సీ ప్రాంతంలో అభివృద్ధి, సంక్షేమం వైసీపీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ అన్నారు. గురువారం మండలంలోని వైయస్సార్ వాహన యాత్ర రోడ్డు షో కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి ప్రారంభించారు. ఈ రోడ్ షో ఒట్టిగడ్డ నుండి ప్రారంభమై రాజవొమ్మంగి, శరభవరం, కింద్ర మీదుగా లబ్బర్తి వరకు సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చి నాలుగున్నర సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ సింగిరెడ్డి రామకృష్ణ, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సర్పంచుల సమైక్య మండల అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, వైస్ ఎంపీపీలు చప్ప చంద్రరాణి, జుర్రా రాజేశ్వరి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీడీవో యాదగిరిశ్వరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండలంలోని పాములేరు పంచాయతీ కుట్రవాడ గ్రామం సత్యసాయి బాబా వాటర్ సరఫరా కేంద్రం సమీపాన గుర్తు తెలియని వ్యక్తి గురువారం అనుమానాస్పదంగా మృతి చెందారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం చేపింది. ఉరి వేసుకొని చెట్టుకు వేలాడుతుండగా, స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. మారేడుమిల్లి పోలీసు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తుపాను, కరువు బాధితులను ఆదుకోవాలని ఆందోళన

విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో అటు కరువు, ఇటు తుపాను వల్ల దెబ్బతిన్న వారిని ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. తుపాను బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని పద్మనాభం, భీమిలి, ఆనందపురం తదితర రూరల్ ప్రాంతాల్లో తీవ్రంగా పంట నష్టం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.